

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.30 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 825.20 అడుగుల వద్ద ఉంది.



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

బాపట్ల అర్బన్ : రేపల్లె ఏబీఆర్ కళాశాలలో 30న నిర్వహించే మెగా జాబ్ మేళా వాల్‌పోస్టర్‌లను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష, జేసీ సీహెచ్ శ్రీధర్ సోమవారం ఆవిష్కరించారు.



కనులపండువగా ఉరుసు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి షాబూఖారీ దర్గా ఉరుసు మహోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. సోమవారం గంధం ఊరేగింపు వైభవంగా జరిగింది.

క్షీరపురి జనసంద్రం..

- మిన్నంటిన సామాజిక విప్లవ నినాదం
- దారులన్నీ చీరాల వైపే
- సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉప్పొంగిన ఉత్సాహం



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్, వేదికపై ఎంపీ మోపిదేవి, సమన్వయకర్త వెంకటేష్



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

చీరాల: క్షీరపురి జనసంద్రమైంది.. బడుగు బలహీనవర్గాలతో పాటుగా ఇతర ఉన్నత వర్గాలు సామాజిక బస్సు యాత్రకు తరలి రావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. యాత్రకు అంచనాలకు మించి నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు తరలిరావడంతో యాత్ర విజయవంతమైంది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సభ దిగ్విజయం కావడంతో నూతన అధ్యాయానికి నాంది పలికారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సమన్వయంతో పనిచేయడంతో సభ సక్సెస్‌గా ముగిసింది. పార్టీ అగ్రనేతలు సభను ఉద్దేశించి చేసిన ప్రసంగాలకు కార్యకర్తలు, నాయకులు హర్షధ్వానాలు పలికారు. గడియార స్తంభం సెంటర్ జనహోరుతో మార్మోగింది. ఈ సభలో ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత మాట్లాడుతూ చంద్రబాబు చరిత్రలో ఏనాడు నిజం చెప్పలేదని విమర్శించారు. అనేక కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లు పొడిచి అధికారంలోకి వస్తాడని, అధికారంలోకి వచ్చిన వెంటనే నమ్మిన వారినే మోసగించి తన వర్గాల వారికి మేలు చేస్తాడని ధ్వజమెత్తారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచడం ఆయన నైజమని అందుకు నిదర్శనమే ఎన్టీఆర్ వెన్నుపోటు అన్నారు. పవన్‌కల్యాణ్‌ను కూడా వాడుకుని వదిలేస్తారని హెచ్చరించారు. చంద్రబాబు ఇంటికో ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగులను మోసగించారని చెప్పారు. చంద్రబాబుకు బడుగు, బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే సీఎం వైఎస్ జగన్ బ్యాక్‌బోన్‌గా చేశారని గుర్తు చేశారు. ఇవన్నీ ఆయా వర్గాల వారు ఆలోచించి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేస్తే ప్రతి పేదవాడి ఇల్లు వెలుగులతో నిండుతాయని ఆకాంక్ష వ్యక్తం చేశారు.



చీరాలలో నిర్వహించిన సాధికార యాత్రకు ర్యాలీగా వస్తున్న నాయకులు

బీసీలను అణగదొక్కింది.. చంద్రబాబే..

ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్, పార్టీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ మాట్లాడుతూ 'అణగారిన వర్గాలను ఊరి అవతల ఉంచిన ఘనత చంద్రబాబుదే.. ఎప్పుడూ కూడా నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనార్టీలు' అన్న సందర్భాలు లేవని, ఆయా కులాలు ఊరి అవతల ఉంచి రాజకీయంగా ఎదగకుండా చేసిన ఘనత బాబుదేనన్నారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు అమ్మఒడి, చేయూత, ఆసరా, భరోసా ఇంటికే పింఛన్, నివేశన స్థలాలు ఎప్పుడు ఇవ్వలేదని చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తన ఇంట్లో లోకేష్‌కే ఉద్యోగం వస్తుందని, అదే సీఎంగా జగనన్న వస్తే ప్రతీ పేదవాడి ఇంట్లో సంతోషం వస్తుందన్నారు. అతి సామాన్యుడు నందిగం సురేష్‌ను ఎంపీగా చేసి ఢిల్లీ పంపారన్నారు. అదే చంద్రబాబు సర్పంచిగా గెలవలేని లోకేష్‌ను మంత్రిగా చేశారన్నారు. 2024లో అయోధ్యలో శ్రీరాముడు విగ్రహ ప్రతిష్ట జరిగిందని, అదే 2024లో మళ్లీ సీఎంగా జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఇంటికి వెళ్లి తలుపుతట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పథకాలు ఉంటున్నాయన్నారు. చంద్రబాబు హామీలను నిలబెట్టుకోలేని వ్యక్తిగా నిలిస్తే పవన్‌కల్యాణ్ నిలకడ లేని వ్యక్తిగా నిలిచారన్నారు. 2024 ఎన్నికల్లో చీరాలతో పాటుగా 175 సీట్లు గెలుస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమృతపాణి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఎదుర్కొనలేక దుష్టచతుష్టయం, పచ్చ మీడియా ద్వారా అబద్ధాలు పలికిస్తు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతుందన్నారు. మళ్లీ జగన్‌ను సీఎం చేసుకుని చీరాల్లో కరణం వెంకటేష్‌ను ఎమ్మెల్యేగా, ఎంపీగా సురేష్‌ను గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బారులు తీరిన ప్రజలు

సామాజిక సాధికార యాత్ర స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో రోడ్డుకు ఇరువైపులా కార్యకర్తలు, నాయకులు బారులు తీరి మంత్రులకు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌కు పూలతో స్వాగతం పలికారు. ర్యాలీ గడియార స్తంభంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరింది. సభాస్థలిలో అప్పటికే వేచి ఉన్న వేలాది మంది ప్రజలు, కార్యకర్తలు అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజవర్గ సమన్వయకర్త వెంకటేష్ ప్రసంగాలకు ప్రజలలో మంచి స్పందన వచ్చింది. ఈలలు, నినాదాలతో హోరెత్తించారు.

న్యూస్‌రీల్

జీడీసీఎంఎస్ పాలకవర్గం పదవీ కాలం పొడిగింపు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జీడీసీఎంఎస్) పాలకవర్గం పదవీకాలాన్ని ఆరు మాసాల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 21వ తేదీవరకు పదవీ కాలం ఉండగా.. దానిని జూలై 21వ తేదీవరకు పొడిగిస్తూ సహకార శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్‌పర్సన్‌గా యార్లగడ్డ భాగ్యలక్ష్మి, సభ్యులుగా ఎ.వెంకటశివ, ఎ.వి జయ భాస్కరరెడ్డి, పి.బాలగురవమ్మ, పి.ఆదినారాయణ, దాసరి రాజు, కుర్రా పాములు ఉన్నారు. ఈ మేరకు కన్నావారితోట లోని జీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం భాగ్యలక్ష్మి చైర్‌పర్సన్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించారు. జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

75 మంది ఎస్‌ఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో 75 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు జిల్లాలో 16, పల్నాడు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 8, ప్రకాశం జిల్లాలో 20, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లాలో 17, తిరుపతి జిల్లాలో ఏడుగుర్ని బదిలీ చేశారు.

యార్డులో 1,15,589 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,15,589 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,04,121 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 52,793 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో ఆంధ్ర నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయంకు చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్యాలయానికి చెందిన అంజలి, పూజిత, హేమ, రేష్మా, పూజ, భవ్యశ్రీ, శ్రావణిలతో పాటు పలువురు చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందచేశారు.

రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

చిలకలపూడి(మచిలీపట్నం): తుపానుకు దెబ్బ తిన్న వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులకు తగిన న్యాయం చేస్తామని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశపు హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వరి కుప్పలను నూర్పిడి చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కొంత మంది రైతులకు ధాన్యం బకాయిలు రావాల్సి ఉందని కమిటీ సభ్యులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై జేసీ స్పందిస్తూ సేకరించిన ధాన్యానికి ఇప్పటి వరకు రూ.637 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేశామన్నారు. సాంకేతిక సమస్యల వల్ల పెండింగ్‌లో ఉన్న నగదును త్వరలో జమ చేస్తామని స్పష్టం చేశారు.వ్యవసాయ సలహామండలి సభ్యులు శ్రీకాకోళపు నాగేశ్వరరావు, పట్టపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్



బాపట్ల అర్బన్: స్పందనలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాల ద్వారా కలెక్టర్‌ను వేడుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని చెప్పారు. ప్రతి అర్జీని పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో వచ్చిన అర్జీలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఈనెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో క్రీడలు ప్రారంభించాలని కోరారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

బాపట్ల అర్బన్: ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం విడుదల చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,510 పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పించినట్లు వివరించారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన 39,754 ఫిర్యాదులను స్వీకరించినట్లు వెల్లడించారు. గతేడాది జనవరి 6 నుంచి ఇప్పటి వరకు 1,84,292 దరఖాస్తులు రాగా 1,55,426 దరఖాస్తులను విచారించినట్లు పేర్కొన్నారు. మిగిలిన 28,547 దరఖాస్తులు తిరస్కరించినట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్చూరు నియోజకవర్గంలో తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేశామని తెలిపారు. పర్చూరు ఈఆర్వో ఫిర్యాదు మేరకు 58 మందిపై 16 కేసులు నమోదు చేశామని చెప్పారు. 41వ నోటీసులు జారీ చేశామన్నారు.

మానస భజరే..శ్రీరామం

ఊళ్లన్నీ అయోధ్యలయ్యాయి..

ఇళ్లన్నీ రామ మందిరాలుగా మారాయి
ఊరూరా భక్తిభావం పెల్లుబికింది
ఆధ్యాత్మిక శోభ విలసిల్లింది
ప్రతి ఇంటా ప్రమిదల ప్రజ్వలన..
శ్రీరామ జయ జయ రామ అంటూ
ఇళ్లపై హనుమంతుడి జెండాల రెపరెపలు
రహదారులకు తోరణాల్లా శోభాయాత్రలు
వీనుల విందుగా, కనుల పండువగా
'తారకనామం దశరథ రామం
మానస భజరే..శ్రీరామం
రామ రామ సీతారామ...' అంటూ
అంతటా భజనలు, శ్లోకాలు, సంకీర్తనలు
రామనామంతో మార్మోగిన ఆలయాలు
అయోధ్యలో బాల రాముడు
అందరి హృదయాల్లో బాల రాముడు
అక్కడ విగ్రహ ప్రతిష్ట కర్తగా ప్రధాని
ఇక్కడ రాముని సేవలో తరించిన జనత
అభిజిత్‌లగ్నంలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట
చూసిన కనులదే భాగ్యమంటూ
84 సెకన్లపాటు విప్పారిన నేత్రాలు..
ఉప్పొంగిన హృదయాలు...
అయోధ్యరాముడి తొలి దర్శనం
'అదృష్ట'నీయం..



పీవీ పాలెం కోదండ రామాలయంలో అయోధ్య బాల రాముడి ప్రాణప్రతిష్ట తిలకిస్తున్న భక్తులు



వేమూరు నియోజకవర్గం కొల్లూరులో శోభయాత్ర



పెదపులివర్రులో కొలువైన సీతారాముల వారు



రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి విడదల రజిని

సుఖసంతోషాలే రామరాజ్యానికి చిహ్నం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

నెహ్రూనగర్: ఎక్కడైతే సిరిసంపదలు, సుఖసంతోషాలు ఉంటాయో అక్కడ రామరాజ్యం ఉన్నట్లుగా భావిస్తారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్టా మహోత్సవం సందర్భంగా రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొరిటిపాడు ప్రాంతంలోని అన్ని రామాలయాలకు మంత్రి విడదల రజిని హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామరాజ్యం లాంటి పరిపాలన అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. భారతదేశం మొత్తం ఏకకాలంలో ఉత్సవాలు జరగడం దేశ ఏకత్వానికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు. మంత్రి వెంట ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఓట్ల లెక్కలు తేలాయి

- జిల్లాలో మొత్తం 12,75,540 ఓట్లు
- అత్యధికంగా మహిళా ఓట్లు
- పురుష ఓటర్లు 6,22,526
- మహిళా ఓటర్లు 6,52,941
- తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఓట్ల లెక్క తేలింది. తుది జాబితా విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్–2024 పూర్తి చేసిన జాబితాను సోమవారం ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా వివరాలను అధికారికంగా ప్రకటించారు.

మహిళలే అధికం..

జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 12,75, 540. అందులో పురుష ఓటర్లు 6, 22, 526 ఉండగా మహిళా ఓటర్లు 6, 52, 941 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 73 మంది ఉన్నారు. మొత్తంగా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా నమోదు అయ్యారు.

అద్దంకి ఓటర్లు..

జిల్లాలో అద్దంకి నియోజకవర్గంలో అత్యధికంగా 2,41, 081 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా బాపట్ల నియోజకవర్గంలో 1, 87,724 మంది ఓటర్లు ఉన్నారు. రేపల్లెలో 2,26,566, పర్చూరులో 2,25,770, చీరాల 1,98,643, మేమూరు(ఎస్సీ)లో 1,95,756 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు.

జిల్లాలోని ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
వేమూరు	94,875	1,00,872	9	1,95,756
రేపల్లె	1,11,071	1,15,475	20	2,26,566
బాపట్ల	91,309	96,409	06	1,87,724
పర్చూరు	1,10,256	1,15,508	06	2,25,770
అద్దంకి	1,18,159	1,22,910	12	2,41,081
చీరాల	96,856	1,01,767	20	1,98,643
మొత్తం	6,22,526	6,52,941	73	12,75,540



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

పెరిగిన ఓటర్ల సంఖ్య

గత ఏడాది అక్టోబర్ 27 నాడు విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాతో పోలిస్తే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 12,409 ఓట్లు మాత్రమే పెరిగాయి. వాస్తవానికి జిల్లాలో కుప్పలు తెప్పలుగా దొంగ ఓట్లు ఉన్నాయన్న ఆరోపణలతో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. దీంతో దొంగ ఓట్లు పెద్ద ఎత్తున బయటపడ్డాయి. వాటన్నింటినీ అధికారులు తొలగించారు. దీంతో వేలాది ఓట్లు తగ్గాయి. పెద్ద ఎత్తున కొత్త ఓటర్లు ఓటు నమోదు చేసుకున్నా దొంగ ఓట్లు తొలగించడంతో కొత్త ఓటర్ల జాబితాలో పెరుగుదల పెద్దగా కనిపించలేదు. ఇలా ఉండగా ఎన్నికల షెడ్యూల్ ఇంకా వెలువడనందున షెడ్యూల్ వెలువడిన పది రోజుల వరకు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశముంది.

ఎస్పీ విస్తృత తనిఖీలు

బాపట్లటౌన్: నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ అంగన్‌వాడీలు తలపెట్టిన చలో విజయవాడ, సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడికి వెళ్లే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో ముఖ్యమైన మార్గాల్లో చెక్ పోస్టులను, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, పట్టణ సీఐ యు.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు పరిష్కరించాం

బాపట్ల అర్బన్: రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని అన్ని దరఖాస్తులు పరిష్కరించామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా ప్రక్రియలో ఇంటింటా సర్వే సమర్థంగా నిర్వహించినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో తప్పులు, పొరపాట్లు, చిరునామాల మార్పు, మృతుల తొలగింపు సవరణ కొరకు బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి విచారించారని వెల్లడించారు. రాజకీయ పార్టీల నుంచి 39,754 ఫిర్యాదులు వచ్చాయని వాటిని సమగ్రంగా పరిశీలించినట్లు వివరించారు. ఒకే ఇంటి నంబర్‌పై పది మంది ఓటర్ల కంటే అధికంగా ఉన్న 864 గృహాలను గుర్తించినట్లు తెలిపారు. 3,770 ఓటర్ల సమస్య పరిష్కరించామని చెప్పారు. పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. సంబంధిత నియోజకవర్గంలోని మండలాల్లో పలుమార్లు నిశితంగా పరిశీలించి, ప్రత్యేకంగా విచారణ చేపట్టామన్నారు. గ్రామంలో నివాసం ఉన్నట్లయితే విధిగా వారికి ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. ఓటు హక్కు పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బతికున్న ఓటర్లను మృతి చెందిన ఓటర్లుగా చూపిన వ్యక్తులను గుర్తించామని ప్రకటించారు. నకిలీ ధ్రువపత్రాలతో ప్రభుత్వ యంత్రాంగాన్ని పక్కదోవ పట్టించిన వారిని గుర్తించి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని చెప్పారు. జాబితాలో మృతులను తొలగించాలని పర్చూరు నుంచి అధికంగా దరఖాస్తులు వచ్చాయన్నారు. జేసీ శ్రీధర్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్చూరు, మార్టూరు, కారంచేడు మండలాలలోని పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లెరూరల్: సీఎం రిలీఫ్‌ఫండ్ ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఉపయోగపడుతుందని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లికి చెందిన బొనిగల విజయ్‌కుమార్ ఇటీవల ప్రమాదానికి గురి కాగా ఆపరేషన్ చేయించుకున్నారు. దీంతో సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.11 లక్షలు చెక్కు మంజూరు కావటంతో చెక్కును ఎంపీ మోపిదేవి తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకరరత్నప్రసాద్ పాల్గొన్నారు. అదే విధంగా రేపల్లె మండలం నల్లూరుపాలెంలో నిర్వహించనున్న జనవరి పండుగను పురస్కరించుకుని గ్రామ యువతకు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు తన వ్యక్తిగతంగా రూ.10 వేలు అందజేశారు.

బడుగు, బలహీన వర్గాలను కాపుకాసే వ్యక్తి జగనే

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట
- బడుగు బలహీనవర్గాల ద్రోహి చంద్రబాబు
- మీడియా సమావేశంలో మంత్రి నాగార్జున, ఎంపీ సురేష్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ, ఎంపీ నందిగం, ఎమ్మెల్యే బలరాం, సమన్వయకర్త వెంకటేష్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ వారి కుటుంబాలకు కాపుకాసి వెన్నుదన్నుగా ఉండే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. సోమవారం సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా చీరాల ఐఎంఏ హాలులో ఏర్పాటు మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో ఉన్న బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన సందర్భాలు లేవన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీనవర్గాల ప్రజల ఆలోచనలు తెలుసుకుని సీఎం వైఎస్ జగన్ పరిపాలన సాగించారన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా కాకుండా బ్యాక్‌బోన్‌గా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి నిలువుటద్దంగా నిలుస్తుందన్నారు. చంద్రబాబు పాలనలో దళితులపై జరిగిన దాడులు, అఘాయిత్యాలు ఏ రాష్ట్రంలో కూడా జరిగుండవని గుర్తు చేశారు. ఎస్సీలను తోకలు కట్ చేస్తామని చంద్రబాబు పాలనలో ఆ పార్టీ నాయకులు హేళనగా మాట్లాడారన్నారు. బీసీలను అయితే బహిరంగంగా వారి మెడలు పట్టి బయటకు నెట్టిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వచ్చిన హక్కులను కాలరాసింది చంద్రబాబేనన్నారు. బీసీలు జడ్జిలుగా పనికిరారంటూ కేంద్రానికి లేఖలు రాశారన్నారు. 2014 ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీలు మూకుమ్మడిగా పోటీ చేశారన్నారు. 2019లో తిరిగి విడివిడిగా పోటీ చేసి పవన్ కళ్యాణ్, టీడీపీ, బీజేపీ నాయకులను తీవ్రంగా విమర్శలు చేశారన్నారు. అయితే ప్రస్తుతం రానున్న ఎన్నికలలో చంద్రబాబుతో పవన్‌కళ్యాణ్ జతకట్టగా వీరితో కలిసి బీజేపీ కూడా ఎన్నికల బరిలో దిగుతున్నారన్నారు. అప్పుడు 440 వాగ్దానాలను ఇచ్చారని, ఏ ఒక్కటీ అమలుచేయలేదన్నారు. రాష్ట్రంలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజలు కూడా గమనించి 2024 ఎన్నికలలో చంద్రబాబు అనే గజదొంగను నమ్మవద్దన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, బీసీలు అవసరమని చెప్పడం కోసమే ఈ బస్సు యాత్రను ఏర్పాటు చేశారన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ మేలు..

బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఏ విధంగా మోసం చేసిందో అందరికి తెలుసునన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి ఒక్కరికి మేలు జరిగిందన్నారు. వారికి జరిగిన మేలును చెప్పేందుకు సామాజిక సాధికార యాత్రను చేపట్టారన్నారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించేందుకు వారికి మంత్రి పదవులు అందించారన్నారు. ఓటు బ్యాంకుగా బీసీలను వాడుకున్న టీడీపీ ప్రభుత్వానికి దీటుగా వారికి రాజ్యాధికారం కల్పించారన్నారు. దళితులకు డెప్యూటీ సీఎం పదవిని, 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చంద్రబాబు రాజకీయంగా వారిని వాడుకున్నారే గాని వారికి ఏనాడూ ఎటువంటి రాజకీయ ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. చీరాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల మన్ననలను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పొందారన్నారు. బడుగు బలహీన వర్గాలకు చేసిన మేలును వివరిస్తూ నిర్వహిస్తున్న సామాజిక సాధికార యాత్రను అందరూ విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ కోరారు. సమావేశంలో పార్టీ నాయకుడు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ నాగార్జున యాదవ్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పార్టీ నాయకులు డాక్టర్ వరికూటి అమృతపాణి, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు, రేవేంద్రపాడు సచివాలయాల పరిధిలో అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ కార్డులను సోమవారం అందజేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష విచ్చేసి కార్డులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా సంవత్సరానికి 25 లక్షల రూపాయల వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చని, డిశ్చార్జి సమయంలో మందులు కూడా ఉచితంగా అందజేస్తారని, ఆసరా పథకం కింద వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తారని వివరించారు.

అర్జీలపై తక్షణమే స్పందించాలి

- ఎస్పీ వకుల్‌జిందాల్
- ఎస్పీ స్పందన 58 ఫిర్యాదులు

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 58 మంది ఎస్పీ వకుల్ జిందాల్‌కు అర్జీలు అందజేశారు. స్పందించిన ఎస్పీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ పాల్గొన్నారు.

వివాహేతర సంబంధాలతో వేధిస్తున్నాడు..

బాపట్ల మండలం, పూండ్ల గ్రామానికి చెందిన నాకు, నాలుగేళ్ల క్రితం అమృతలూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావుతో వివాహం అయింది. నాకు ఏడాదిన్నర వయస్సు కలిగిన పాప ఉంది. ఇటీవల నా భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని నన్ను వేధిస్తున్నాడు. దీనికి మా అత్త, వెంకటేశ్వరమ్మ, మామ పోలురాజు సహకరిస్తున్నారు. నన్ను చంపుతామని బెదిరిస్తున్నారు. న్యాయం చేయాలి.

– ఇట్టా మేఘమాల, అమృతలూరు



ఎస్పీకి సమస్య విన్నవిస్తున్న బాధితురాలు

గుంటూరు రేంజ్ పరిధిలో సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరి కొందరు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు రేంజ్ పరిధిలో మరో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
బి.రమేష్‌బాబు	రేంజ్ వీఆర్, గుంటూరు గుంటూరు జిల్లా	పాతగుంటూరు పీఎస్,
మొగిలి	పాతగుంటూరు పీఎస్,	బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్,
ఎం.హైమారావు	బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా	బుచ్చిరెడ్డిపాలెం పీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా.
వెంకటసుబ్బారావు	గుంటూరు జిల్లా	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
బి.పాపారావు	త్రిపురాంతం సర్కిల్, ప్రకాశం జిల్లా	గూడూరు 1 టౌన్ పీఎస్, తిరుపతి జిల్లా
షేక్.సమిఉల్లాహ	మాచర్ల రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా	దర్శి సర్కిల్, ప్రకాశం జిల్లా
జె.రామకోటయ్య	దర్శి సర్కిల్, ప్రకాశం జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
బీవీవీ.సుబ్బారావు	రేంజ్ వీఆర్, గుంటూరు	గూడ్లూరు సర్కిల్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
కె.అజయ్‌కుమార్	ఎస్సీ, ఎస్టీ సెల్, ప్రకాశం జిల్లా	దిశ -2, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
టి.విజయకృష్ణ	రేంజ్ వీఆర్, గుంటూరు	సీసీఎస్, ప్రకాశం జిల్లా
పి.బాలాజీ	సీసీఎస్, ప్రకాశం జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
కె.వాసు	మేడికొండూరు పీఎస్, గుంటూరు జిల్లా	సోషల్ మీడియా/ సైబర్ క్రైం సెల్ గుంటూరు జిల్లా
డి.జయకుమార్	కారెంపూడి సర్కిల్, పల్నాడు జిల్లా	మేడికొండూరు పీఎస్, గుంటూరు జిల్లా

ఏఎన్ఆర్ జీవిత చరిత్ర అందజేత



ఏఎన్ఆర్ ఫ్రేమ్‌ను నాగసుశీలకు అందిస్తున్న మహిత

కారంచేడు: సినీ హీరో అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్ర ఫ్రేమ్‌ను ఏఎన్ఆర్ కుమార్తె నాగసుశీల, ఏఎన్ఆర్ మనుమరాలు సుప్రియలకు సోమవారం అందించారు. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్నం మహిత అందజేసింది. ఏఎన్ఆర్ వర్ధంతి సందర్భంగా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన అన్న నరసింహారావు, భ్రమరాంబ దంపతుల కుమార్తె అన్నం మహిత ఏఎన్ఆర్ జీవిత చరిత్రను రచించింది. పెన్సిల్ మొనలపై ఆయన చిన్నప్పటి నుంచి మరణించే వరకు ఆయన జీవితంలో ముఖ్య ఘట్టాలను పెన్సిల్ మొనలపై ఆమె రచించి చూపరులను అబ్బురపరిచింది. తన తండ్రి జీవిత చరిత్రను పెన్సిల్ మొనలపై లిఖించడాన్ని పరిశీలించిన నాగసుశీల అన్నం మహితను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. సూక్ష్మ కళల్లో మరింత నైపుణ్యం సొంతం చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. మహిత వెంట ఆమె తండ్రి నరసింహారావు ఉన్నారు.

యువకుడి ప్రాణం తీసిన అతివేగం

జె.పంగులూరు: అతి వేగం ప్రాణం తీసింది.. మండల పరిధిలోని పంగులూరు గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. కొండమంజులూరు గ్రామానికి చెందిన చొప్పరపు మోజేష్(35), పంగులూరులో బంధువుల ఇంటికి వచ్చాడు. కార్యక్రమం ముగించుకొని తన బైకుపై స్వగ్రామం బయలు దేరాడు. అప్పటికే మద్యం తాగిఉన్న మోజేష్‌ను వెళ్లొద్దని బంధువులు వారించారు. అయినా లెక్క చేయక తన బైకుపై వేగంగా వెళ్లాడు. గ్రామం నుంచి కిలో మీటరు దూరం వెళ్లిన తరువాత బైకు వేగాన్ని నియంత్రించలేక కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆర్థిక చక్రానికి ఆసరా

- జిల్లాలో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు 27,629 మంది
- నేడు ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- రూ.238.30 కోట్లు జమ చేయనున్న ప్రభుత్వం
- నాలుగు విడతల్లో రూ.953.35 కోట్లు జమ



ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్యే కోన(ఫైల్)

బాపట్ల అర్బన్: జగనన్న ఇచ్చిన మాట.. మహిళామణులకు బంగారు బాటగా మారుతోంది. డ్వాక్రా అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధి వైఎస్సార్ ఆసరా చేయూతగా నిలుస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా పథకం ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలను మాఫీ చేయగా నాలుగో విడత నిధులు విడుదల చేయనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బటన్ నొక్కి డ్వాక్రా మహిళల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు.

చెప్పాడంటే చేస్తాడంతే..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ప్రతి గ్రామాన్ని చుట్టేశారు. ఈ సమయంలో డ్వాక్రా అక్కాచెల్లెమ్మ కష్టాలను కళ్లారా చూశారు. అధికారంలోకి వస్తే డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలను విడతల వారీగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. చెప్పిన మాటకు కట్టుబడి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలను మాఫీ చేస్తున్నారు. తాజాగా నాలుగో విడత జమ చేయనున్నారు.

నమ్మించి వంచించిన బాబు..

2014 ఎన్నికలకు ముందు రైతు రుణమాఫీతో పాటు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత డ్వాక్రా రుణాల మాఫీ గురించి పట్టించుకో లేదు. చివరకు 2019 ఎన్నికలకు ముందు పసుపు కుంకుమ పేరుతో మహిళలను వంచించారు. దీంతో బ్యాంకుల్లో డ్వాక్రా రుణాలు పెరిగిపోయి డ్వాక్రా సంఘాలు డిఫాల్ట్ గా మారిపోయాయి.

జగనన్న అండగా.. ఆర్థికాభివృద్ధి మెండుగా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణాలను మాఫీ చేయడంతో మళ్లీ సంఘాలు పుంజుకున్నాయి. ఆసరా కింద 4 విడతల్లో రూ.953.35 కోట్లు అందనుంది. తొలి విడత 27,643 సంఘాలకు రూ.236.76 కోట్లు, 2వ విడత రూ.239.99 కోట్లు, మూడో విడత రూ.230.32 కోట్లు అందించారు. 4వ విడతగా 27,692 సంఘాలకు రూ.238.30 కోట్లు విడుదల చేయనున్నారు.

నేటి నుంచి ఆసరా ఉత్సవాలు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులు మంగళవారం విడుదల చేయనున్నారు. ఇప్పటికే మూడు విడతలు మంజూరయ్యాయి. నాలుగో విడత నిధులు విడుదల చేస్తే వంద శాతం రుణ చెల్లింపు పూర్తవుతుంది. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆసరా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నాం.

– చొప్పర కృష్ణ, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ